క్లుప్తంగా

ఈవీఎంలపై అవగాహన పెంచుకోవాలి



ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

అమలాపురం టౌన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎంల ద్వారా ఓటు వేసే విధానంపై ఓటర్లు అవగాహన పెంచుకోవాలని మున్సిపల్ మేనేజర్ మాచిరాజు మూర్తి తెలిపారు. మున్సిపల్ కార్యాలయ భవనం పరిధిలోని 30, 31, 32, 34 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి శుక్రవారం ఈవీఎంలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఈవీఎంలపై తమకున్న సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా మేనేజర్ మూర్తి మాట్లాడుతూ ఈవీఎంలు పనిచేసే విధానం, ఓటు వేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఓటర్లకు అవగాహన కల్పించారు. మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ భాస్కర్, వార్డు సచివాలయ కార్యదర్శి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం



పేదలకు ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లు అందజేస్తున్న ఆర్డీఓ కేశవవర్ధన్‌రెడ్డి, రమణారావు

ఉప్పలగుప్తం: గుడ్ సీడ్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ఆర్డీఓ కేశవవర్ధన్‌రెడ్డి అన్నారు. చల్లపల్లి పంచాయతీ జగ్గరాజుపేటలో గుడ్ సీడ్ ఫౌండేషన్ తృతీయ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఫౌండర్, వైఎస్సార్ సీపీ నాయకుడు కుంచే రమణారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్డీఓ హాజరై రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, మహిళలకు కుట్టు మెషీన్లు అందజేశారు. తల్లిదండ్రులను కోల్పోయిన నిరు పేదలకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు వేసి ఆర్డీఓ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించారు. అనంతరం పుట్టిన రోజును పురస్కరించుకుని రమణారావు కేక్ కట్ చేయగా, పలువురు శుభాకాంక్షలు తెలిపారు. తహసీల్దార్ వెంకటేశ్వరీ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సెప్టిక్లీన్ వాహనాల పంపిణీ



వాహనాల తాళాలను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: స్థానిక మున్సిపాలిటీలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నేషనల్ సఫాయి కర్మాచారి ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా మంజూరైన రూ.64 లక్షల విలువైన రెండు సెప్టీక్లీన్ వాహనాల పంపిణీ శుక్రవారం జరిగింది. పట్టణ వాటర్ వర్క్స్ విభాగంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ వాహనాలను ఇద్దరు సఫాయి కర్మాచారులకు ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అందజేశారు. కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు మాట్లాడుతూ రూ.32 లక్షల విలువైన ఒక్కో వాహనాన్ని లబ్ధిదారునికి 50 శాతం రాయితీతో ఇచ్చామన్నారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



దివ్యాంగురాలికి దుప్పటి అందజేస్తున్న సీఐ క్రాంతికుమార్

అమలాపురం టౌన్: స్థానిక శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమం ఆధ్వర్యంలో పేదలు, దివ్యాంగులు, యాచకులకు ఐదు రోజుల నుంచి దుప్పట్లు పంపిణీ జరుగుతోంది. అమలాపురంతో పాటు అంబాజీపేట, కొత్తపేట పరిసర ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ యోగాశ్రమ గురువు ఆకుల శ్రీనివాస్ తెలిపారు. అమలాపురంలో సీఐ టి.కాంత్రికుమార్ చేతుల మీదుగా దివ్యాంగులకు దుప్పట్లు అందజేశారు. ఐదు రోజులుగా సుమారు 500 దుప్పట్లు పంచిపెట్టారు. చలి కాలంలో పేదలకు దుప్పట్లు అందిస్తున్న యోగాశ్రమ గురువు శ్రీనివాస్‌ను సీఐ క్రాంతికుమార్ అభినందించారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ స్వరాజ్యం

- వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ
- గ్రామాల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం



పల్లంకుర్రులో ప్రచార కరపత్రాలు అందజేస్తున్న నాయకులు



సాకుర్రులో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ దోలామణి తదితరులు

కాట్రేనికోన: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రానికి సంక్షేమ స్వరాజ్యం వచ్చిందని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాతి సత్యనారాయణ అన్నారు. పల్లంకుర్రులో సర్పంచ్ నాతి అలివేణి ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ మండల కన్వీనర్ నల్లా నరసింహమూర్తి మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్నే ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. నాయకులు ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలు పంచారు. సంక్షేమాన్ని ప్రతి ఇంటికీ తీసుకొచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని తిరిగి ఆశీర్వదించాలని జెడ్పీటీసీ సభ్యుడు నేల కిశోర్ కోరారు. కార్యక్రమంలో పాలెపు ధర్మారావు, తిరుపతి వెంకటేశ్వరరావు, జనిపెల్లే శ్రీనివాసరావు, బొంతు అజయ్, సాపే సూర్యప్రకాశరావు తదితరులు ఉన్నారు.

సాకుర్రులో..

అమలాపురం రూరల్: సాకుర్రు సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. అమలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి, సర్పంచ్ గుత్తుల చిరంజీవి, వైస్ ఎంపీపీ పోలమురి బాలకృష్ణ పాల్గొని సంక్షేమ పథకాల డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఉప సర్పంచ్ బండారు చంద్రరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు బొక్కా నరసింహమూర్తి, మాజీ సర్పంచులు ములపర్తి సత్యనారాయణ, చొల్లంగి సాయిబాబు, ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

గాడిమొగలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

తాళ్లరేవు: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావాలని గాడిమొగ సర్పంచ్ కామాడి గోవలక్ష్మి అన్నారు. గాడిమొగ సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి కూడా చేస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ప్రగతి పథంలో నడిపిస్తున్నారన్నారు. ప్రభుత్వం చేసిన లబ్ధిని ప్రజలకు వివరించేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి వీజీవీ రమణ తెలిపారు. అనంతరం సంక్షేమ పథకాల ఫ్లెక్సీని నాయకులు ఆవిష్కరించారు. ఈఓపీఆర్డీ మల్లాడి భైరవమూర్తి, సచివాలయ కన్వీనర్ కర్రి ఆదినారాయణమూర్తి, నాయకులు కామాడి మాతరాజు, తాతారావు, మల్లాడి వర్మ, వైదాడి ధర్మారావు, లంకే వీరబాబు, వైదాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కోరంగిలో మాట్లాడుతున్న సర్పంచ్ కామాడి గోవలక్ష్మి

మహిళల జీవన ప్రమాణాలు మెరుగు

అల్లవరం: కొమరగిరిపట్నం గ్రామ సచివాలయం –3 పరిధిలో సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు హాజరై మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో మహిళల జీవన ప్రమాణాలు పెరిగాయన్నారు. అనంతరం సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఎంపీటీసీ సభ్యుడు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, జీఎస్‌కే కన్వీనర్ తిక్కా ప్రసాద్, పాలకవర్గ సభ్యులు, కార్యదర్శి ఎన్‌వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థుల ప్రతిభ

యానాం: పుదుచ్చేరిలో ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో స్థానిక రీజెన్సీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని శుక్రవారం హెచ్‌ఎమ్ టీవీఎస్ఎస్‌వీ ప్రసాదరావు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రైమరీ స్థాయి విభాగంలో పొలిమారి సాత్విక్, తోట కార్తికేయ ప్రాజెక్టులు బెస్ట్ సబ్ థీమ్ విభాగంలో బహుమతులు సాధించాయి. వీరికి ఉషారామలక్ష్మి, వరలక్ష్మి గైడ్ టీచర్లుగా వ్యవహరించారన్నారు. వీరు చేసిన చంద్రయాన్ ప్రాజెక్టును ప్రదర్శించిన కార్తికేయ జనవరిలో తిరుపతిలో జరిగే దక్షిణ భారత స్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపికైనట్లు తెలిపారు.

పబ్లిక్ సర్వీస్ కమిషన్ బోర్డు ఏర్పాటు చేయాలి

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా నాలుగు రీజియన్‌లలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 10 వేల ఉద్యోగాల భర్తీకి సీఎం రంగసామి చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో పుదుచ్చేరి పబ్లిక్ సర్వీసు కమిషన్‌ను ఏర్పాటు చేయాలని శుక్రవారం పలువురు నిరుద్యోగులు కోరారు. ప్రస్తుతం 1,200 పోస్టులకు ప్రకటనలు ఇచ్చి వెయ్యి పోస్టులను మాత్రమే భర్తీ చేశారన్నారు. వివిధ శాఖల్లో వివిధ ఖాళీలు ఉన్నాయని, త్వరితగతిన భర్తీ చేయాలన్నారు. ఒకేసారి అన్ని పోస్టులకు పోటీ పరీక్ష నిర్వహించాలన్నారు.

హెపటైటిస్ వైరస్‌తో జాగ్రత్త



వైద్యులతో చర్చిస్తున్న నోడల్ ఆఫీసర్ డాక్టర్ నీలిమ

అమలాపురం టౌన్: హెపటైటిస్ వైరస్ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నేషనల్ వైరస్ హెపటైటిస్ కంట్రోల్ ప్రోగ్రామ్ రాష్ట్ర నోడల్ ఆఫీసర్ డాక్టర్ నీలిమ సూరపనేని అన్నారు. ఈ వైరస్‌ను ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా అది క్యాన్సర్‌గా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో హెపటైటిస్ నిర్మూలనపై శుక్రవారం జరిగిన ప్రత్యేక వైద్య శిబిరంలో డాక్టర్ నీలిమ మాట్లాడారు. దాదాపు 30 నుంచి 40 ఏళ్ల కిందట ఇళ్లకు వచ్చే సంచి డాక్టర్లు ఇంజెక్షన్లు చేసేటప్పుడు సిరంజిలకు స్టెరిలైజేషన్ చేయకపోవడం వల్ల పాత తరం వారిలో ఆ వైరల్ మూలాలు ఇప్పుడు బయట పడుతున్నట్లు సర్వేలో గుర్తించామని డాక్టర్ నీలిమ తెలిపారు. ఇది రక్తం ద్వారా సునాయాసంగా ఓ అంటు వ్యాధిలా మనిషి నుంచి మనిషికి సంక్రమించి వ్యాప్తి చెందుతుందని స్పష్టం చేశారు. భార్యాభర్తల్లో ఎవరికి సోకినా అది ఇద్దరికీ సంక్రమిస్తుందన్నారు. అలాంటి వారు తక్షణమే పరీక్షలు చేయించుకుని వ్యాక్సిన్ వేయించుకుని మందులు వాడాలని సూచించారు. ఇవన్నీ ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తోందని చెప్పారు. అనంతరం ఆమె డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ భారతలక్ష్మి, జిల్లా ఇమ్యునైజేషన ఆఫీసర్ బీవీవీ సత్యనారాయణ, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు, ఆర్ఎంవో డాక్టర్ అనూష, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ జిల్లాలో హెపటైటిస్ వైరస్ విస్తరణపై సమీక్షించారు. రాష్ట్రంలో గతంలో 13 మాత్రమే హెపటైటిస్ కంట్రోల్ ప్రోగ్రామ్ కేంద్రాలు ఉండేవని, ఇప్పుడు ప్రభుత్వం 31 కేంద్రాలకు విస్తరించిందని చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్యులు పట్టణం సమీపంలో గల అబ్బిరెడ్డి రామదాసు కాలనీకి వెళ్లారు. ఇంటింటికి వెళ్లి వైరస్‌పై అవగాహన కల్పించారు.

ఎమ్మెల్సీ సాబ్జీ మృతికి సంతాపం



అమలాపురంలో ఎమ్మెల్సీ సాబ్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

ఉప్పలగుప్తం: ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతికి యూటీఎఫ్ మండల శాఖ దిగ్భ్రాంతి తెలిపింది. భీమనపల్లి ఉన్నత పాఠశాలలో శుక్రవారం యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎ.సురేష్ అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. సాబ్జీ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్ఎం సత్యనారాయణ, యూటీఎఫ్ నాయకుడు గుత్తుల సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి ఏవీ చంద్రసూర్యం పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం ఉపాధ్యాయ రంగానికి తీరని లోటని యూటీఎఫ్ శాఖ జిల్లా అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక యూటీఎఫ్ హోమ్‌లో సాబ్జీకి సంతాప సభ నిర్వహించారు. పూర్వపు యూటీఎఫ్ అధ్యక్షుడిగా సాబ్జీ ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేశారని వక్తలు గుర్తు చేసుకున్నారు. రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటీవీ సుబ్బారావు, జిల్లా కార్యదర్శులు జీవీ రమణ, పి.మురుగేశ్వరరావు, బి.చంద్రకళ ప్రసంగించారు. ఎమ్మెల్సీ సాబ్జీ మృతికి జిల్లా ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య చైర్మన్ శివప్రసాద్ నాగిరెడ్డి ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు.

అర్హులందరికీ పథకాల లబ్ధి



పేరూరులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న డాక్టర్ శ్రీకాంత్

అమలాపురం రూరల్: అర్హులందరికీ పథకాల లబ్ధి అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కుతుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. పేరూరు తోట్లపాలెం గ్రామంలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా అనే విషయాలు తెలుసుకున్నారు. స్థానిక సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని అధికారులకు శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్ గోపాల్, సర్పంచ్ దాసరి అరుణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు, ఎంపీటీసీ సభ్యులు చొల్లంగి సుబ్బిరామ్, దొంగా ఆంజనేయులు, వాసంశెట్టి శ్రీను, ఉప సర్పంచ్ కుడుపూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరం

ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు



అమలాపురంలో పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, నాగేంద్రమణి తదితరులు



ముమ్మిడివరంలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కమిషనర్ తదితరులు

అమలాపురం టౌన్: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం అజరామరమని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన పొట్టి శ్రీరామలు వర్ధంతి కార్యక్రమానికి ఎమ్మెల్సీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, కౌన్సిలర్లు నాగారపు వెంకటేశ్వరరావు, కట్టోజు సన్నయ్యదాసు, కొల్లాటి దుర్గాబాయి, మున్సిపల్ మేనేజర్ మాచిరాజు మూర్తి, కోఆప్షన్ సభ్యుడు జాన్సన్ బిల్లీ, మున్సిపల్ ఆర్వో శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: స్థానిక నగర పంచాయతీ కార్యాలయ సమావేశ మందిరంలో శ్రీరాములు చిత్రపటానికి కమిషనర్ జి.లోవరాజు, నాయకులు, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. సచివాలయ, మెప్మా సిబ్బంది, వార్డు వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

చిత్రకారుడు అంజికి సత్కారం



చిత్రకారుడు అంజిని సన్మానిస్తున్న సభ్యులు

కాట్రేనికోన: ప్రముఖ చిత్రకారుడు, చలన చిత్ర దర్శకుడు, పద్మశ్రీ సత్తిరాజు లక్ష్మీనారాయణ (బాపు) జయంతిని పురస్కరించుకుని పాలకొల్లులో బాపు విగ్రహ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన చిత్రకారులు ఉదయ్‌కుమార్, కట్టా మహేష్, నీల్‌కమల్ మూర్తి, మండలానికి చెందిన ఆకొండి అంజి చిత్రకళా పోటీల్లో పాల్గొని బాపు చిత్రాలను గీశారు. ఈ మేరకు శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అంజి అందుకున్నారు. అనంతరం అంజిని సత్కరించారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి

అల్లవరం: సచివాలయ ఉద్యోగులపై అంగన్‌వాడీ సిబ్బంది అసత్య ప్రచారాలు మానుకోవాలని ఏపీ స్టేట్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం పేర్కొంది. ప్రభుత్వం, అధికారుల నుంచి వచ్చే ఆదేశాలను అమలు చేయడం తమ బాధ్యతని రాష్ట్ర కమిటీ ఈసీ మెంబర్ వడ్డి బేబికుమారి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమ్మె కాలంలో పైఅధికారుల సూచనలు, ఆదేశాలతో అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు తెరిచి గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశామన్నారు. తాళాలు పగలుకొట్టారు, దొంగల్లా వెళ్లారు, వీరికి పనీపాట లేదని కొంత మంది అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడటం సబబు కాదన్నారు. సచివాలయ ఉద్యోగుల పట్ల కొన్ని రాజకీయ శక్తులు అక్కసు వెళ్లగక్కడం సహించబోమన్నారు.

గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మె



కొంకాపల్లిలో నిరసన తెలుపుతున్న డివిజన్ గ్రామీణ తపాలా ఉద్యోగులు

అమలాపురం టౌన్: కేంద్ర ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ డివిజన్‌లోని గ్రామీణ తపాలా ఉద్యోగులు చేస్తున్న సమ్మె శుక్రవారంతో నాలుగో రోజుకు చేరుకుంది. శుక్రవారం పట్టణ శివారు కొంకాపల్లిలో సత్తెమ్మ గుడి వద్ద అమ్మవారి సమక్షంలో ఆ ఉద్యోగులు కుటుంబీకులతో సహా నిరసన తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు కె.సత్తిబాబు, వాసంశెట్టి సత్తిరాజు వీరి నిరసన శిబిరాన్ని సందర్శించి సమ్మెకు మద్దతు తెలిపారు. తపాలా ఉద్యోగుల రాష్ట్ర నాయకుడు వీవీ రామకృష్ణ ఆధ్వర్యంలో సమ్మె జరుగుతోంది.

పూజా మహోత్సవాలకు విరాళాలు



యమ ధర్మరాజు చిత్రాన్ని గీస్తున్న రవి సీతారామశాస్త్రి

అమలాపురం టౌన్: అమలాపురం శ్రీగౌతమ మహర్షి అక్షయ పాత్ర సంస్థ ఆధ్వర్యంలో ప్రతి నెలా బహుళ త్రయోదశి, చతుర్దశి, అమావాస్య తిథుల్లో నిర్వహించే సమవర్తి ధర్మరాజు పూజా మహోత్సవాలకు శుక్రవారం విరాళాలు వచ్చాయి. ఈ పూజా మహోత్సవంలో వినియోగించేందుకు చిత్రకారుడు గొర్తి రవి సీతారామశాస్త్రి వేసిన యమ ధర్మరాజు తైలవర్ణ చిత్రాలకు సలాది సాయిరామ్ రూ.40 వేలు విరాళంగా సమకూర్చారు. అలాగే పూజా మహోత్సవాలకు పట్టణానికి చెందిన సలాది దొరయ్యనాయుడు రూ.30 వేలు, జాస్తి భోపాల్ రూ.25 వేలు, శ్రీవల్లి రూ.6 వేలు, నల్లా హరిప్రియ రూ.5 వేలు విరాళాలుగా అందించారు. అక్షయపాత్ర సభ్యులు గొర్తి రామసూర్య భాస్కరం, సుబ్బలక్ష్మి దంపతులు పాల్గొన్నారు.

'ఈనాడు' తప్పుడు వార్తలు నమ్మవద్దు

అమలాపురం టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించాలని అనేక విద్యా సంస్కరణలు చేస్తున్నారని, వీటిని ప్రోత్సహించాల్సింది పోయి 'ఈనాడు' పత్రికలో తప్పుడు కథనాలు వండి వార్చడం దారుణమని అమలాపురం పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి జగన్‌ను, రాష్ట్ర ప్రభుత్వాన్ని కావాలని కించపరిచేలా తప్పుడు వార్తలు రాస్తున్న 'ఈనాడు'ను ప్రజలు నమ్మవద్దని ఆయన స్పష్టం చేశారు. ఆ పత్రిక అధిపతి రామోజీరావు పచ్చ మీడియా ప్రభావంతో పచ్చి అబద్ధాలు రాస్తున్నారని తెలిపారు. చంద్రబాబుకు బాకా ఊదే రామోజీరావుకు జగన్ ప్రభుత్వంలో విద్య కోసం చేస్తున్న సంస్కరణలు కనిపించడం లేదని బులినాని అన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



ఎంజీజీ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

యానాం: నియోజకవర్గంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నాణ్యతపై ఫిర్యాదుల నేపథ్యంలో శుక్రవారం ఆర్ఏఓ మునిస్వామి తనిఖీలు చేశారు. స్థానిక ఎంజీజీ, రాజీవ్ గాంధీ ప్రభుత్వ ఇంగ్లిషు మీడియం హైస్కూళ్లను ఆకస్మికంగా తనిఖీ చేసి మధ్యాహ్న భోజనం మెనూ పరిశీలించారు. పప్పు టమాటా కూర నీరులాగా ఉందని విద్యార్థులు తెలిపారు. దీంతో ఆయన స్పందించి సెంట్రల్ కిచెన్ ఇన్‌చార్జి పాము సత్యనారాయణకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత కలిగి రుచికరంగా ఉండాలని సూచించారు.

అక్రమ కుళాయి కనెక్షన్ల తొలగింపు



కొత్త కోరంగిలో అక్రమ కుళాయి కనెక్షన్ తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ కొత్తకోరంగిలో 25 అక్రమ కుళాయి కనెక్షన్‌లను అధికారులు శుక్రవారం తొలగించారు. పలుచోట్ల కుళాయిల నుంచి తాగునీరు సక్రమంగా అందకపోవడంపై వచ్చిన ఫిర్యాదుల మేరకు సర్పంచ్ పెయ్యల మంగేష్ ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది అక్రమ కుళాయి కనెక్షన్‌లను గుర్తించారు. ఈఓపీఆర్డీ మల్లాడి భైరవమూర్తి, పంచాయతీ కార్యదర్శి ఎ.రామరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి టి.మారుతీరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు క్రాంతి, దుర్గాప్రసాద్‌లతో పాటు వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి స్వయంగా పరిశీలించారు. అనుమతులు లేకుండా వేసుకున్న అక్రమ కుళాయి కనెక్షన్‌లను తొలగించి డమ్మీలు వేశారు. నాలుగు నీటి పంపింగ్ మోటార్‌లను స్వాధీనం చేసుకున్నారు. పంచాయతీ అనుమతులు లేకుండా కుళాయి కనెక్షన్లు వేసుకుంటే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

క్రిమికీటకాల నిర్మూలనతోనే సంపూర్ణ పారిశుధ్యం

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందుకు ప్రతి శుక్రవారాన్ని పొడివారం (డ్రైడే)గా పాటించి క్రిమి కీటకాలను నిర్మూలిస్తున్నట్లు చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.మల్లికార్జున, డి.సువర్చలాదేవి, డి.సాయికిషోర్ కోరారు. డ్రై డే ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. రుబ్బు రోళ్లు, కొబ్బరిచిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలు ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమికీటకాలు దరిచేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదని అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను వారు కోరారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రైడే ఆవశ్యకతను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలమణి తదితరులు వైద్య సేవలను పర్యవేక్షించారు.

రేపటి నుంచి ధనుర్మాస మహోత్సవాలు



యానాంలో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి

యానాం: స్థానిక వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఈ నెల 17 నుంచి వచ్చే ఏడాది జనవరి 14 వరకూ ధనుర్మాస మహోత్సవాలు జరుగనున్నాయి. వీటిని అర్చకులు పెద్దింటి లక్ష్మణాచార్యులు, పెద్దింటి రఘురామవినోదాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు శ్రీవేంకటేశ్వర దేవస్థానం అధికారులు తెలిపారు. ఈ నెల 23న ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా తెల్లవారు జామున 3 గంటల నుంచి సుప్రభాతసేవ, మద్దింశెట్టి వెంకటసత్యప్రసాద్ దంపతులచే అభిషేకం, అర్చనలు ఉంటాయన్నారు. కాగంటి మధుసూదనరావు ఉత్సవదారులుగా గరుడ వాహనోత్సవం, నల్లం నాగబాబు, శ్రీరామచంద్రమూర్తి దంపతులచే శాంతి కల్యాణం జరుగుతుందని అన్నారు.